ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
శనివారం 6 జనవరి 2024 | 5



పూల ప్రేమికులకు ఆహ్వానం

- నేడు యానాంలో ఫలపుష్ప ప్రదర్శన, ప్రజాఉత్సవాలు ప్రారంభం - 7లో

పిఠాపురంలో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

- 7లో

పెత్తనం పాయె

- వైసీపీలో జగ్గంపేట, ప్రత్తిపాడు, పిఠాపురం సిట్టింగ్ ఎమ్మెల్యేల హవాకు చెక్
- వచ్చే ఎన్నికలకు సీటు లేకపోవడంతో పార్టీలో పలకరించేవారే కరువు
- కొత్త ఇన్‌ఛార్జుల ఆధ్వర్యంలోనే పెన్షన్ల పంపిణీ

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

ఆ ముగ్గురూ వైసీపీ ఎమ్మెల్యేలు.. అధికారం అండతో ఇంత కాలం నియోజకవర్గాల్లో చెలరేగిపోయారు. తమకు అడ్డేలేదన్నట్లు వ్యవహరించారు. అధికారులను కంటి చూపుతో శాసించారు. తీరా పరిస్థితులు తలకిందులయ్యాయి. వచ్చే ఎన్నికల్లో తిరిగి పోటీ చేస్తే ఓడిపోతారనే కారణంతో వైసీపీ అధిష్టానం వీరి టిక్కెట్లు చింపేసింది. పోటీ చేయడానికి లేదని పక్కన పెట్టింది. వీరి స్థానంలో కొత్త ఇన్‌ఛార్జులను నియమించింది. దీంతో ఇప్పుడు వీరి కొత్త పెత్తనం మొదలైంది. అధికారులకు హుకుం జారీ చేయడం దగ్గరనుంచి పింఛన్ల పంపిణీ వరకు ఇప్పుడు కొత్త ఇన్‌ఛార్జులే పెత్తనం ప్రారంభించారు. అధికారిక హోదా లేకపోయినా అధికార పార్టీ ఇన్‌ఛార్జి హోదాతో చక్రం తిప్పుతున్నారు. ఇంత కాలం ఓ వెలుగు వెలిగిన ప్రత్తిపాడు, జగ్గంపేట, పిఠాపురం ఎమ్మెల్యేలు పర్వత ప్రసాద్, జ్యోతుల చంటిబాబు, పెండెం దొరబాబుల ప్రాధాన్యం నియోజకవర్గాల్లో మసకబారిపోయింది. జగ్గంపేట ఎమ్మెల్యే చంటిబాబు వైసీపీకి దూరమైపోగా ప్రత్తిపాడు ఎమ్మెల్యే ఇంటికే పరిమితం కాగా, పిఠాపురం ఎమ్మెల్యే దొరబాబు దీనంగా కొత్తఇన్‌ఛార్జితో తాత్కాలిక ప్రయాణం కొనసాగిస్తున్నారు.



జగ్గంపేటలో పింఛన్లు పంపిణీ చేస్తున్న వైసీపీ ఇన్‌చార్జ్ తోట నరసింహం

కొత్తా పెత్తనమండీ..

అసెంబ్లీ ఎన్నికలు సమీపించడంతో అధికార వైసీపీ సర్వేల పేరుతో సిట్టింగ్ ఎమ్మెల్యేలకు షాక్ ఇచ్చింది. పనితీరు బాగోలేదని, ప్రజల్లో వ్యతిరేకత ఎక్కువగా ఉందనే కారణాలతో జిల్లాలో ప్రత్తిపాడు, జగ్గంపేట, పిఠాపురం ఎమ్మెల్యేలను పక్కన పెట్టింది. వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ లేదని అధికారికంగా చెప్పేసింది. వీరి స్థానాల్లో కొత్త ఇన్‌ఛార్జులను నియమించింది. ఈ నేపథ్యంలో టిక్కెట్ కోల్పోయిన ఎమ్మెల్యేల పరిస్థితి దీనంగా మారింది. టిక్కెట్ లేదనే సరికి ఇంతకాలం వెంట తిరిగిన నేతలు, కార్యకర్తలు సైతం కొన్ని రోజులుగా ముఖం చాటేస్తున్నారు. ఇంతకాలం నియోజకవర్గాల్లో రారాజులుగా ఓ వెలుగు వెలిగిన ముగ్గురు ఎమ్మెల్యేల పరి స్థితి దయనీయంగా మారింది. మరోపక్క కొత్త ఇన్‌ఛార్జులుగా నియమించిన వారికే పార్టీలోను, ప్రభుత్వంలోను ప్రాధాన్యమివ్వాలని వైసీపీ అధిష్టానం అప్పుడే క్యాడర్‌తోపాటు అధికారులకు సంకేతాలు పంపింది. ఈ నేపథ్యంలో వీరంతా ఎమ్మెల్యేలను పక్కకుపెట్టి పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జుల ఆదేశాలకే ప్రాధాన్యం ఇవ్వడం మొదలుపెట్టారు. ముఖ్యంగా ఈనెల పెంచిన రూ.3వేల పెన్షన్ డబ్బులను అనేక నియోజకవర్గాల్లో వైసీపీ ఎమ్మెల్యేలు, అధికారులు పంపిణీ చేశారు. ప్రత్తిపాడులో ఎమ్మెల్యేను పక్కన పెట్టేశారు. ఈస్థానంలో కొత్త నియోజకవర్గ ఇన్‌ఛార్జి అయిన మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు పంచబోతున్నారు. ఇందుకు ముహూర్తం శనివారంనుంచి అనుకూలంగా ఉందని భావించి రంగంలోకి దిగుతున్నారు. ఎమ్మెల్యే పర్వతప్రసాద్ పరిస్థితి దయనీయంగా మారింది. ఇంతకాలం తానే ఇవన్నీ చేయగా, ఇప్పుడు తనస్థానంలో ప్రత్యర్థిగా భావించే వరుపుల రంగంలోకి దిగడంతో కుతకుతలాడుతున్నారు. జగ్గంపేటలో ఎమ్మెల్యే చంటిబాబు టిక్కెట్ దక్కలేదన్న కోపంతో వైసీపీని వీడినట్లే అయింది. ఇప్పటికే జనసేన అధినేత పవన్‌ను కూడా కలిశారు. ఇటీవల సీఎం జగన్ కాకినాడ పర్యటనకు వచ్చినప్పుడు చంటిబాబు ముఖం చాటేశారు. ఇప్పటికీ ఎమ్మెల్యే అయినా నియోజకవర్గంలో పార్టీక్యాడర్, అధికారులు సైతం ఆయన వైపు కన్నెత్తి చూడడం లేదు. కొత్త ఇన్‌ఛార్జి అయిన మాజీమంత్రి తోట నరసింహం శుక్రవారం తన నియోజకవర్గంలో పెన్షన్లు పంపిణీ చేశారు. వాస్తవానికి ప్రభుత్వం ఇచ్చే పెన్షన్లు ఎన్నికైన ప్రజాప్రతినిధులైన ఎమ్మెల్యేలు పంపిణీ చేయాలి. కానీ వైసీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జులకు ఏ అధి కార హోదా లేకపోయినా అధికార పార్టీ నేత కావడంతో పంపిణీ చేస్తున్నారు. టిక్కెట్ పోవడంతో తమకు పదవీకాలం ఉన్నా సరే నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు పర్వత, చంటిబాబు పర్యటించడం మానేశారు. కొత్త నియోజకవర్గ ఇన్‌ఛార్జులే పెత్తనం మొదలుపె ట్టారు. పింఛన్ల పంపిణీకి అధికారులు నిబంధనల ప్రకారం ఎమ్మెల్యేలను పిలవాలి. కానీ ప్రభుత్వం పరోక్షంగా వీరిని పక్కన పెట్టి కొత్తగా ఎంపిక చేసిన పార్టీ ఇన్‌ఛార్జులను పిలవాలని ఆదేశించడంతో ఇప్పుడు వీరి హవా మొదలైంది. పిఠాపురంలో ఎమ్మెల్యే దొరబాబుకు టిక్కెట్ ఇవ్వలేదు. ఈ స్థానంలో ఎంపీ వంగా గీతకు సీటు కేటాయించారు. దీంతో ఆమెతో కలిసి ఎమ్మెల్యే దొరబాబు యు.కొత్తపల్లి మండలంలో శుక్రవారం పింఛన్లు పంపిణీ చేశారు. ఇంతకాలం దొరబాబు పంపిణీ చేసిన పింఛన్లు ఇప్పుడు ఆయన సమక్షంలో వంగా గీత పంచడం ప్రారంభించారు. తనస్థానంలో కొత్తగా వచ్చిన నియోజకవర్గ ఇన్‌ఛార్జి గీతతో తాత్కాలిక రాజకీయ ప్రయాణం కొనసాగిస్తున్న దొరబాబు కొద్దిరోజుల్లో పక్కకు తప్పుకోనున్నట్లు సమాచారం. ఎన్నికలు దగ్గరపడ్డంతో నియోజకవర్గాల్లో ఓట్లకోసం ఏయే పనులు అత్యవసరంగా చేపట్టాలనే దానిపైనా ఇన్‌ఛార్జులు ఎమ్మెల్యేలను పక్కన పెట్టి అధికారులకు ఆదేశాలు ఇవ్వడం మొదలుపెట్టారు.

ఒంటి కాలిపై సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన



కాకినాడలో ఒంటి కాలిపై నిల్చొని నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరసన



తునిలో సోదె చెబుతూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

తెలుగు వైభవం!





సభలో మాట్లాడుతున్న బీజేపీ నేత రామ్‌మాధవ్, వేదికపై గవర్నర్ బిశ్వభూషణ్, స్వరూపానందేంద్ర, యార్లగడ్డ, చైతన్యరాజు తదితరులు.. సభలో ప్రదర్శిస్తున్న నృత్యరూపకం

- అట్టహాసంగా ప్రారంభమైన 2వ అంతర్జాతీయ తెలుగు మహాసభలు
- హాజరైన చత్తీస్‌గఢ్ గవర్నర్ బిశ్వభూషణ్
- మహాసభలను ప్రారంభించిన స్వరూపానందేంద్ర
- 10 వేల మంది విద్యార్థులతో వేమన శతక ఆలాపన
- తొలిరోజు కవి సమ్మేళనం, భాషా ప్రక్రియలపై సదస్సు
- పలువురికి పూర్ణ కుంభ పురస్కారాలు

రాజానగరం/దివాన్‌చెరువు, జనవరి 5: ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహిస్తున్న 2వ అంతర్జాతీయ తెలుగు మహాసభలు గైట్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. శ్రీరాజరాజ నరేంద్రుల పట్టాభిషేక సహస్రాబ్ది నీరాజనంగా, నన్నయ భట్టారకుని మహాభారతం వెయ్యేళ్లను పురస్కరించుకుని తెలుగు మహాసభలు నిర్వహిస్తున్నారు. రాజరాజనరేంద్ర, నన్నయ భట్టారక, నారాయణ భట్టు వేదికలపై సందడిగా తెలుగుదనం ఉట్టిపడేలా వివిధ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. చైతన్య విద్యాసంస్థల వ్యవస్థాపకుడు కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) అధ్యక్షత వహించిన ప్రధాన వేదిక శ్రీరాజరాజ నరేంద్ర వేదిక నుంచి విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి తెలుగు మహాసభలను లాంఛనంగా ప్రారంభించారు. ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్, చత్తీస్‌గఢ్ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, ఆర్‌ఎస్‌ఎస్ జాతీయ కార్యదర్శి వారణాసి రామ్‌మాధవ్, మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు, మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు, విశ్వనాథ గోపాలకృష్ణ, పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, వీసీ ప్రసాదరాజు, ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ గౌతమ్‌రెడ్డి, పారిశ్రామికవేత్త వర్మ, అష్టావధాని బులుసు అపర్ణ మాట్లాడారు.

తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటాలి : బిశ్వభూషణ్

శ్రీకృష్ణ భగవానుడు గీతలో బోధించిన యదా యదా హి ధర్మస్య.. అంటూ మహా భారతాన్ని ఆదికవి నన్నయ తెలుగున అనువదించడాన్ని ప్రస్తావిస్తూ తెలుగుభాష విశిష్టత, ఔన్నత్యాన్ని చాటిచెప్పేలా ఇటువంటి సదస్సులు నిర్వహించడంపై చత్తీస్‌గఢ్ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ నిర్వాహకులను అభినందించారు. సాహిత్య, సాంస్కృతిక కళలకు నిలయంగా శోభిల్లుతున్న గోదావరి తీరాన తెలుగు మహాసభలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. గోదావరినది అన్నా, రాజమహేంద్రవరం అన్నా తనకు ఎంతో అభిమానమన్నారు. ముందుగా విశాఖ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతిస్వామి మాట్లాడుతూ తెలుగు భాషలాంటి భాష ఈ సృష్టిలో లేదన్నారు. ప్రపంచంలో ఎన్ని భాషలు ఉన్నప్పటికీ తెలుగు భాష మాధుర్యం, గొప్పతనం మరే భాషకు సాటిరాదని, తెలుగు భాషకు పూర్వ వైభవం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. సంస్కృతం కన్నా తెలుగులోనే ఎక్కువ అక్షరాలు ఉన్నాయన్నారు. బీజేపీ జాతీయ నేత రామ్‌మాధవ్ మాట్లాడుతూ తెలుగు భాషకు 2500 ఏళ్ల చరిత్ర, 1700 ఏళ్ల సాహిత్య చరిత్ర ఉందన్నారు. మన సంస్కృత భాషను మృతభాష అని ఆంగ్లేయులు వర్ణించారని, భాషలు బలహీనపడతాయేగానీ మరణించవన్నారు. వాటిని జీవింపజేసే ప్రయత్నం కింది స్థాయి నుంచి జరగాల్సి ఉందన్నారు. పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ తెలుగునేలను సస్యశ్యామలం చేసిన సర్‌ఆర్థర్ కాటన్, తెలుగు నిఘంటువు రూపొందించిన సీపీ బ్రౌన్, అలాగే గురజాడ అప్పారావు, కందుకూరి వీరేశలింగం ప్రాతఃస్మరణీయులన్నారు. తెలుగు వారి ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన నందమూరి తారకరామారావు, రాజ్యసభలో ఎవరి మాతృభాషలో వారు మాట్లాడే వీలు కల్పించిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడులను గుర్తు పెట్టుకోవాలన్నారు. మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ మాట్లాడుతూ చదువుకన్నా సంస్కారం ప్రధానమైందని, తెలుగుభాష నేర్చుకుంటే సంస్కారం అలవడుతుందన్నారు. అ అంటే అమ్మ అని, ఆ అంటే ఆవు అని నేర్చుకున్న మాటలను గుర్తుచేస్తూ అమ్మ ప్రేమకు సంకేతమైతే, ఆవు త్యాగానికి సూచికగా చెప్పారు. తెలుగు నేర్చుకుంటే సంస్కారం అలవడుతుందన్నారు. మాతృభాషపై అభిమానం ఉండాలన్నారు. మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు మాట్లాడుతూ తల్లి లాంటి తెలుగు భాషను మరువకూడదన్నారు. మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు మాట్లాడుతూ తమిళ ప్రాంత పాలనలో ఉన్న యానాం నుంచి ఎమ్మెల్యేగా, మంత్రిగా ప్రాతినిధ్యం వహించిన తాను అసెంబ్లీలో తెలుగులోనే మాట్లాడేవాడినని గుర్తుచేశారు. ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ గౌతంరెడ్డి మాట్లాడుతూ తెలుగు భాషను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. అంతర్గత భావాలను వ్యక్తపరచడానికి మాతృభాష దోహదం పడుతుందన్నారు. జేఎన్టీయూ వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ తెలుగు మహాసభల నిర్వహణతో తెలుగుపై అందరికీ మమ కారం ఏర్పడుతుందన్నారు. చైతన్య విద్యా సంస్థల చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు మాట్లాడుతూ ఈ మహాసభల నిర్వహణతో సరిపెట్టుకోకుండా తెలుగు భాష ఉన్నతికి తమ కుటుంబం తరఫున ట్రస్ట్ ఏర్పాటు చేసే యోచన ఉందన్నారు. గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగు భాషలోని మాధుర్యాన్ని అందరూ ఆస్వాదించి, ప్రతి ఒక్కరూ తెలుగు భాష నేర్చుకోవాలన్నారు. తెలుగు భాషపై పట్టు సాధిస్తే ఇతర భాషలపై కూడా పట్టువస్తుందన్నారు. తాను 121 భాషల్లో గజల్స్ పాడానని చెబుతూ ఆయా భాషల వాళ్లు ఆ గజల్స్‌ను ఎంత ఆనందించారో చెప్పనలవికాదన్నారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్త రవివర్మ, ఆంధ్రసారస్వత పరిషత్ ముఖ్య సలహాదారులు కె.రామ్‌ప్రసాద్, శతావధాని కడిమెళ్ల వరప్రసాద్, రెడ్డప్ప ధవేజీ, కోట్ల కనకేశ్వరరావు, మంతెన కేశవరాజు, వేటుకూరి సూర్యనారాయణరాజు, తెలుగు మహాసభల సమన్వయకర్త సునంద రమేష్, అపుస్మా అధ్యక్షుడు సంకవల్లి మురళి, పలువురు కవులు, రచయితలు, భాషాభిమానులు పాల్గొన్నారు.



ఎంపీ, సినీ రచయిత విజయేంద్రప్రసాద్‌ను సత్కరిస్తున్న దృశ్యం

కవి సమ్మేళనం, భాషా ప్రక్రియపై సదస్సు

నారాయణభట్టు వేదికపై ఏర్పాటుచేసిన కవి సమ్మేళన అంకురార్పణ సభలో మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ తెలుగు వైభవ కీర్తి అందరూ ఆనందించదగినదన్నారు. కవులు, రచనలు చేసేవారు వీరేశలింగం పంతులును స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. పొరుగు రాష్ట్రాల వారు భాషను కాపాడుకోవడానికి చేస్తున్న ఉద్యమాలను వివరించారు. కవులు తమ కవితలు ద్వారా జాతిని జాగృతం చేస్తూ తెలుగు భాషను నిలబెట్టుకోవాలని సూచించారు. ఆది కవి నన్నయ వేదికపై ఏర్పాటుచేసిన సదస్సుల అంకురార్పణ సభలో ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రవచనాలు, కావ్యాలు, పద్యాలు నేర్పించాలన్నారు. సంసారంలో సమస్యలకు సాహిత్యంతో పరిష్కారం లభిస్తుందని ప్రవచించారు. ప్రతిభావంతులను ఎవరూ అడ్డుకోలేరన్నారు. తిరుపతి వేంకట కవులు, చెళ్లపిళ్ల కవుల్లో దాగిన ప్రతిభకు ఎవరూ సాటిరారని చెప్పారు.

ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో..
రేపు కాకినాడలో ముత్యాల ముగ్గుల పోటీలు

కాకినాడ, జనవరి 5(ఆంధ్రజ్యోతి): కాకినాడ పట్టణంలోని పీఆర్ కాలేజీ ఎదురుగా ఉన్న మెక్లరిన్ హైస్కూల్‌లో "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన" ఈనెల 7న ఆదివారం జరగనున్నాయి. జిల్లా పోటీలకు స్పాన్సరర్‌గా కాకినాడకు చెందిన సానా సతీష్ ఫౌండేషన్ వ్యవహరిస్తోంది. ఆ రోజు ఉదయం 9 గంటలకు ముత్యాల ముగ్గుల పోటీలు ప్రారంభమవుతాయి. జిల్లా నలుమూలలనుంచి మహిళలు ఈ పోటీల్లో పాల్గొనవచ్చు. విజేతలైన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలవారికి రూ.6వేలు, రూ.4వేలు, రూ.3వేలు చొప్పున నగదు బహుమతులు ఉంటాయి. పోటీల్లో పాల్గొనే మహిళలు పేర్ల నమోదుకు 9949485803, 9985411207, 9985411260 నెంబర్లను సంప్రదించగలరు.

చంద్రబాబు సభపై నేడు సమీక్ష

కాకినాడ సిటీ, జనవరి 5: ఈనెల 10న తునిలో నిర్వహించనున్న టీడీపీ అధినేత చంద్రబాబు సభపై శనివారం సాయంత్రం 4 గంటలకు కాకినాడలోని పార్టీ జిల్లా కార్యాలయంలో సమీక్ష నిర్వహించనున్నారు. లక్షమందితో ఈ సభ నిర్వహించేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించనున్నారు. కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పార్టీ ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకులతో ఈ సమావేశం ఏర్పాటు చేశారు.

12 నాటికి మార్పులు, అభ్యంతరాల దరఖాస్తుల పరిష్కారం

- జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా

కాకినాడ సిటీ, జనవరి 5: ఎస్‌ఎస్‌ఆర్-2024లో భాగంగా గత అక్టోబరు 27న ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, అభ్యంతరాలపై అందిన దరఖాస్తులను ఈ నెల 12వతేదీ నాటికి పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఎస్‌ఎస్‌ఆర్-2024 రూపకల్పనలో భాగంగా జిల్లాలో జరుగుతున్న వివిధ కార్యకలాపాలను, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించి పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు సహకరించాలని కోరారు. సమావేశంలో ఇన్‌చార్జి డీఆర్వో కె.శ్రీరమణి, రాజకీయ పార్టీల ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు, పెద్దిరెడ్డి రవికిరణ్, గదుల సాయిబాబు, తుమ్మల రమేష్, సబ్బారపు అప్పారావు, వి.చంద్రరావు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం డీటీ ఎం.జగన్నాథం పాల్గొన్నారు.



తెలుగుజాతికి వివిధ రంగాల్లో సేవలందించిన తనికెళ్ల భరణి, మండలి బుద్ధప్రసాద్, తదితరులకు పూర్ణకుంభ పురస్కారాలను అందజేస్తున్న జస్టిస్ కృష్ణమోహన్, పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఆచార్య కొలకలూరి ఇనాక్, చైతన్యరాజు, గజల్ శ్రీనివాస్







వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించిన విద్యార్థులు





తెలుగు మహాసభలకు హాజరైన విద్యార్థులు

తెలుగు జాతికి సేవలందించినవారు ధన్యులు

- తెలుగు మహాసభల్లో జస్టిస్ కృష్ణమోహన్
- పూర్ణకుంభ అవార్డుల ప్రదానోత్సవం
- గైట్ కళాశాలలో అంతర్జాతీయ తెలుగు మహాసభలు



గైట్ కళాశాలలో జరుగుతున్న అంతర్జాతీయ తెలుగు మహాసభల్లో పాల్గొన్న కవులు, రచయితలు, ప్రముఖులు

రాజానగరం, జనవరి 5: తెలుగుజాతికి పూర్వీకులు అందించిన సేవలను గుర్తించుకుని వారి వారసులను సత్కరించడం అభినంద నీయమని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ అన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థలు సంయుక్త ఆధ్వర్యంలో గైట్ కళాశాలలో జరుగుతున్న అంతర్జాతీయ తెలుగు మహాసభల్లో భాగంగా శుక్రవారంరాత్రి రాజరాజ నరేంద్రుని వేదికపై నిర్వహించిన పూర్ణకుంభ అవార్డుల ప్రధానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. తెలుగుజాతికి ఎందరో మహనీయులు అంకితభావం, సేవాభావంతో పనిచేసి ఆనందంగా జీవించారని, అలాగే మనందరం పనిచేసి రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధికి పాటుపడాలన్నారు.

ప్రాథమిక విద్యాబోధన మాతృభాషలోనే జరగాలి

మహోన్నత చరిత్ర కలిగిన తెలుగువారందరికీ మనం ప్రతినిధులమన్న సంగతి మర్చిపోకుండా ఈ వారసత్వాన్ని భవిష్యత్తుతరాలకు అందించాల్సిన ఆవశ్యకత అందరిపై ఉందని మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. తెలుగు బాష, జాతి అనేక సవాళ్లు ఎదుర్కొంటున్న తరుణంలో విద్యార్థులకు తెలుగుజాతి ప్రతిభ, చైతన్యాన్ని పరిచయం చేయడం అభినందనీయమన్నారు. రాజమహేంద్రవరంలో సాంస్కృతిక వారసత్వం పుణికిపుచ్చుకున్న వాళ్లు ఎందరో ఉన్నారని, అందుకే ఇది సాంస్కృతి రాజధాని అని పేర్కొన్నారు.

పురస్కారాలు అందించడం అభినందనీయం

- సినీ రచయిత తనికెళ్ల భరణి

సినీ రచయిత తనికెళ్ల భరణి మాట్లాడుతూ ఇంతమంది గొప్ప తెలుగువారి వారసులను ఒకే వేదిక మీదకు రప్పించి పురస్కారాలు అందించడం అభినందనీయమన్నారు. ఇంతమందిని చూశాక తన జన్మ ధన్యమైందన్నారు. గజల్ శ్రీనివాస్ తలపెట్టిన తెలుగుసభల నిర్వహణకు సహకరించడం చైతన్యరాజు చిరకాలం గుర్తుంటారని భరణి పేర్కొన్నారు.

ఘనంగా పూర్ణకుంభ పురస్కారాల ప్రదానం..

తెలుగుజాతికి సేవలందించిన వివిధ రంగాల ప్రముఖుల వారసులు అలాగే వివిధ రంగాల్లో సేవలందిస్తున్న ప్రముఖులకు పూర్ణకుంభ పురస్కారాలతో జస్టిస్ కృష్ణమోహన్, పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఆచార్య కొలకలూరి ఇనాక్, ఏపీ ఫైబర్ నెట్ కార్పొరేషన్ ఛైర్మన్ గౌతమ్‌రెడ్డి చేతులమీదుగా చైతన్యరాజు, గజల్ శ్రీనివాస్ అందజేశారు. తరిగొండ వెంగమాంగ, కవయిత్రి మొల్ల, తిక్కన సోమయాజి, డొక్కా సీతమ్మ, పరవస్తు చిన్నయసూరి, గుర్రం జాషువా, మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి, పెద్దింటి దీక్షిత్‌దాసు, ఘంటసాల వెంకటేశ్వరరావు, మండలి వెంకట కృష్ణారావు, సాలూరి రాజేశ్వరరావు, పీబీ శ్రీనివాస్, జంధ్యాల, మునా రాయలు, బాపు తదితరుల వారసులు పురస్కారాలు స్వీకరించారు. అలాగే విశ్వనాథ గోపాలకృష్ణ, దాట్ల బుచ్చి వెంకటపతి రాజు, జిత్‌మోహన్‌మిత్ర, ఎర్రాప్రగడ రామకృష్ణ, కూచిబొట్ల ఆనంద్, రసరాజు, బాదం బాలకృష్ణ, వంశీ రామరాజు, చెరుకువాడ రంగసాయి, తనికెళ్ల భరణి, గౌతమీ గ్రంథాలయం, నన్నయ భట్టారక పీఠం, చింతలూరు ఆయుర్వేద ఫార్మసీ పతినిధులు పురస్కారాలు అందుకున్నవారిలో ఉన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, గైట్ మేనేజింగ్ డైరెక్టర్ కె.శశికిరణ్ వర్మ, ఆంధ్ర సారస్వత పరిషత్ ముఖ్య సలహాదారు కె.రామ్‌ప్రసాద్, శతావధాని కడిమెళ్ల వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





అంతర్జాతీయ తెలుగు మహాసభలలో జరుగుతున్న సాహితీ సదస్సులో మాట్లాడుతున్న ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త గరికపాటి నర్సింహారావు, జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జస్టిస్ కృష్ణమోహన్

మాజీ ఎంపీ కొత్తపల్లి గీత ఎస్టీ కాదు

- ఏపీ ఎస్టీ ఉద్యోగుల సంఘం అప్పీలుపై జీవో జారీచేసిన ప్రభుత్వం
- 2016లో ఎస్టీగా నిర్ధారించిన తూర్పు కలెక్టరు ఉత్తర్వులు రద్దు

రంపచోడవరం, జనవరి 5: అరకు మాజీ ఎంపీ, బీజేపీ నాయకురాలు కొత్తపల్లి గీత ఎస్టీ కులస్తురాలు కాదంటూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. 2016లో ఆమెపై జరిగిన కులవిచారణ నివేదిక ఆధారంగా అప్పటి తూర్పుగోదావరి జిల్లా కలెక్టరు సదరు కొత్తపల్లి గీత ఎస్టీ (వాల్మీకి) కులస్తురాలేనంటూ నిర్ధారిస్తూ ఉత్తర్వులను ఇచ్చారు. దీనిపై ఏపీ ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఇ. ఆంజనేయులు, ఆర్.మహేశ్వరరావు సదరు కలెక్టరు ఉత్తర్వులను ఆక్షేపిస్తూ ప్రభుత్వం వద్ద 2016లోనే అప్పీలు దాఖలు చేశారు. ఈ అప్పీలుపై తెలుగుదేశం ప్రభుత్వంలోనూ, వైకాపా ప్రభుత్వంలోనూ మొత్తం నలుగురు మంత్రులు విచారణ జరిపారు. ఇటీవల కాలంలో ఈ అప్పీలుపై జరుగుతున్న విచారణ తీరుపై కొత్తపల్లి గీత రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. 2023 ఏప్రిల్‌లో హైకోర్టు ఉత్తర్వులు జారీ చేస్తూ నాలుగు నెలల్లో ఈ అప్పీలును ముగించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ అప్పీలు కేసును ప్రస్తుత గిరిజన సంక్షేమ మంత్రి పి.రాజన్నదొర విచారణ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వం గురువారం నాడు గిరిజన సంక్షేమ (కుల విచారణ) విభాగం ద్వారా జీవో ఎమ్ఎస్.నెం.2ను జారీ చేస్తూ 2016లో కొత్తపల్లి గీతను ఎస్టీగా నిర్ధారిస్తూ అప్పటి కలెక్టరు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేస్తూ ఆమె ఎస్టీ కాదని ప్రభుత్వం పేర్కొంది.

ఘంటసాలకు నివాళులర్పించిన కోడలు పార్వతి



ఘంటసాల పార్వతిని సత్కరిస్తున్న కల్చరల్ అసోసియేషన్ సభ్యులు

ధవళేశ్వరం, జనవరి 5: ధవళేశ్వరం ఇరిగేషన్ పార్కులో ఏర్పాటుచేసిన అమరగాయకుడు ఘంటసాల విగ్రహాన్ని ఆయన కోడలు ఘంటసాల పార్వతి, టీవీ యాంకర్, డబ్బింగ్ ఆర్టిస్ట్ శిల్పతో కలిసి సందర్శించి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ ఘంటసాల కోడలు కావడం పూర్వజన్మ సుకృతమన్నారు. ఆమెను గోదావరి కల్చరల్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఘంటసాల విగ్రహాన్ని ఏర్పాటుచేసిన అసోసియేషన్ సభ్యులను ఆమె అభినందించారు. రాక రమణ, యర్రమోతు ధర్మరాజు, గ్రంధి జగన్నాథం, తాతారావు, శేషకుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పిఠాపురంలో విజిలెన్స్ తనిఖీలు

- 29.6క్వింటాళ్ల రేషన్‌బియ్యం స్వాధీనం
- ఇద్దరిపై కేసు నమోదు

పిఠాపురం, జనవరి 5: కాకినాడ జిల్లా పిఠాపురంలో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు అందిన సమాచారంతో అధికారులు పలు వాహనాలను పరిశీలించారు. మినీవ్యాన్‌లో తరలిస్తున్న 48 సంచుల్లో ఉన్న 24.10క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తుంచారు. కార్డుదారులు, ఎండీయూ ఆపరేటర్ నుంచి కిలో రూ.20లకు వీటిని కొనుగోలు చేసినట్లు విచారణలో వెల్లడైంది. కార్డుదారులకు రేషన్‌సరుకులు అందించాల్సిన ఎండీయూ వాహనాన్ని రేషన్‌బియ్యం అక్రమ రవాణాకు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. 11 సంచుల్లో ఉన్న 5.50 క్వింటాళ్ల బియ్యాన్ని గుర్తించారు. రెండు వాహనాల్లో ఉన్న 29.60 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఎండీయూ వాహనం, మినీ వ్యాన్‌లను సీజ్ చేశారు. రేషన్‌బియ్యం అక్రమంగా తరలిస్తున్న ఎండీయూ ఆపరేటర్ పైలా శ్రీను, కందరాడకు చెందిన సీహెచ్.లక్ష్మణరావులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పోలీసులకు సూచించినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు.



పిఠాపురంలో విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న రేషన్‌బియ్యం, వాహనాలు

ఇటలీ నుంచి వచ్చి.. ఆటో కొని..

- పర్యాటక ప్రాంతాలను చుట్టేస్తున్న విదేశీయులు
- పొల్లూరు ట్రైగ్రిస్ జలపాతం వద్ద ఇటలీవాసుల సందడి

మోతుగూడెం, జనవరి 5: అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెంలో గురువారంరాత్రి నుంచి ఇటలీ దేశస్థులు మోతుగూడెం, పొల్లూరులో సందడి చేశారు. వీరు ఇటలీ నుంచి ఢిల్లీ వచ్చారు. ఢిల్లీ నుంచి కేరళ వెళ్లి కొచ్చిలోని ప్రకృతి అందాలను చూస్తూ కాలం గడిపారు. తర్వాత ఆటో కొనుగోలుచేసి కొచ్చి నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజుజిల్లా మోతుగూడెం ప్రాంతంలోని ప్రకృతి అందాలను చూడ్డానికి వచ్చామన్నారు. మోతుగూడెం పరిసర ప్రాంతాల్లో ఉన్న పొల్లూరు జలపాతం, ఫోర్‌బై కెనాల్, డొంకరాయి డ్యామ్ చూసి మేఘాలయ పయనమయ్యారు.



పొల్లూరు ట్రైగ్రిస్ జలపాతం సందర్శనకు వచ్చిన ఇటలీ వాసులు

పూల ప్రేమికులకు ఆహ్వానం



ఆకర్షిస్తున్న రంగురంగుల పుష్పాలు

- నేడు ఫలపుష్ప ప్రదర్శన, ప్రజా ఉత్సవాలు ప్రారంభం

యానాం, జనవరి 5: తూర్పుగోదావరి జిల్లాలో అంతర్భాగంగా ఉన్న కేంద్రపాలిత ప్రాంతమైన యానాం నియోజకవర్గంలో పూలప్రేమికులను ఆహ్లాదపరిచేందుకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో 22వ ఫలపుష్ప ప్రదర్శనకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. స్థానిక జీఎంసీ బాలయోగి క్రీడామైదానంలో గత 20 సంవత్సరాలుగా ఈ ఉత్సవాలను జనవరి 6నుంచి8 వరకూ మూడు రోజులపాటు ఘనంగా నిర్వహిస్తున్నారు. నేడు ప్రారంభం కానున్న ఈ ఫలపుష్ప ప్రదర్శనకు పుదుచ్చేరి మంత్రులతోపాటు ఉన్నాతాధికారులు, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిది మల్లాడి కృష్ణారావు, స్థానిక ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ వివిధశాఖల అధికారులు హాజరుకానున్నారు. ముఖ్యంగా ఈ ఫలపుష్పప్రదర్శన యానాం, పరిసర ప్రాంత ప్రజలకు మంచి ఆహ్లాదకర వాతావర ణాన్ని చేకూరుస్తోంది. వీటిలో తూర్పుగోదావరి జిల్లాలోని కడియం, రాజమహేంద్రవరం, బెంగుళూరు, తదితర ప్రాంతాల నుంచే కాకుండా యానాం వ్యవసాయశాఖ, మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పెంచుతున్న వివిధ రకాల జాతులు ఫలపుష్పాలను ప్రదర్శనకు ఉంచుతారు. అన్ని ఏర్పాట్లు స్థానిక వ్యవసాయ శాఖ డీడీ శివసుబ్రహ్మణ్యన్ పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే వివిధ నర్సరీల నుంచి అనేక రకాల పూలమొక్కలు యానాం చేరుకున్నాయి. నేడు సాయంత్రం 4గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. మూడు రోజులపాటు జరిగే ఈ ఫలపుష్ప ప్రదర్శనలో ప్రజల నందరినీ ఆకర్షించే విధంగా వివిధ రకాల స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్పీ రఘునాయగం ఆధ్వర్యంలో సీఐ షణ్ముగం గట్టి బందోబస్తును సిద్ధం చేశారు.



ప్రదర్శనలో ఉంచిన వివిధ రకాల ఫలపుష్పాలు



ఫలపుష్ప ప్రదర్శన ఏర్పాట్లును పరిశీలిస్తున్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి

కువైట్‌లో గుండెపోటుతో మృతి చెందిన అంతర్వేది వాసి



కొల్లాబత్తుల కుమార్‌రత్నం

అంతర్వేది, జనవరి 5: సఖినేటిపల్లి మండలం అంతర్వేది గ్రామానికి చెందిన కొల్లాబత్తుల కుమార్‌రత్నం(50) గుండెపోటుతో మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. పది సంవత్స రాలు కువైట్ దేశంలో పనిచేసుకుంటూ రెండు, మూడుసార్లు స్వదేశానికి వచ్చి మళ్లీ అదే దేశంలో ఉద్యోగం చేస్తుండగా గుండె పోటు రావడంతో మృతి చెందారు. కుమార్ రత్నానికి భార్య పాప ఉన్నారు. ఆర్థిక పరిస్థితి బాగోలేక పొట్ట చేత పట్టుకుని కువైట్ వెళ్లిన కుమార్‌రత్నం మరణవార్త వినగానే కుటుంబ సభ్యులంతా శోకసంద్రంలో మునిగితేలారు. కువైట్ తెలుగు సేవలు సంస్థ ఆధ్వర్యంలో మృతదేహాన్ని స్వగ్రామానికి పంపిస్తున్నట్టు జి.మురళి తెలిపారు. కువైట్‌లో మంగళవారం గుండెపోటుతో మృతి చెందిన కుమార్‌రత్నం మృతదేహాన్ని శుక్రవారం సాయంత్రం అంతర్వేది చేరుకోవడానికి కువైట్ తెలుగు సేవాసంస్థకు పలువురు సహకరి ంచారని అంతర్వేది గ్రామస్థులు తెలిపారు.

నేడు కల్యాణోత్సవాలపై సమీక్షా సమావేశం

అంతర్వేది, జనవరి 5: మాసమాసంలో ప్రారంభమయ్యే అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలపై ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి ఆధ్వర్యంలో శనివారం సమీక్షాసమావేశం నిర్వహిస్తున్నట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

సామర్లకోట, జనవరి 5: కాకినాడ జిల్లా సామర్లకోట మండలం మాధవపట్నం గ్రామ శివారున పొలాల్లో చెట్టుకొమ్మ కు ఒక వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం అర్ధరాత్రి జరిగిన ఈ సంఘటన శుక్రవారం వెలుగు చూసింది. వీఆర్వో ఇచ్చిన సమాచారంతో సామర్లకోట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతుడు దండంగి రాంబాబు(35)గా ప్రాథమికంగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆశ్రమ పాఠశాల బాలిక మృతి

- హెచ్‌ఎం, వార్డెన్ నిర్లక్ష్యమంటూ బంధువుల రాస్తారోకో
- ట్రైబల్ వెల్ఫేర్ డీడీతో విచారణ జరిపించనున్న ఐటీడీఏ పీవో

కూనవరం, జనవరి 5: కూనవరం మండలం నర్సింగపేట ఆశ్రమ పాఠశాలకు చెందిన మడకం సంధ్య(12) కడుపునొప్పితో మృతి చెందింది. ఈ మృతికి ఆశ్రమ పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయురాలు, వార్డెన్ నిర్లక్ష్యం అంటూ బాలిక బంధువులు ఆశ్రమ పాఠశాల ఎదుట పెద్దఎత్తున నాలుగు గంటలపాటు రాస్తారోకో నిర్వహించారు. మృతురాలి బంధువుల కథనం ప్రకారం ఎటపాక మండలం ఎర్రబోరు గ్రామానికి చెందిన సంధ్య నర్సింగపేట ఆశ్రమ పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. ఈనెల 1న తీవ్రమైన కడుపునొప్పి వచ్చింది. కడుపునొప్పితో సంధ్య బాధపడుతూనే ఉంది. ఆ సమయంలో పాఠశాల సిబ్బంది నూతన సంవత్సర వేడుకల్లో మునిగితేలడంతో సంధ్యను పట్టించుకోలేదని బంధువులు చెబుతున్నారు. కనీసం సిబ్బంది అందుబాటులో కూడా లేరని బంధువులు ఆరోపిస్తున్నారు. తెల్లారి రెండో తేదీన సంధ్య కడుపునొప్పితో బాధపడుతూనే పాఠశాల సిబ్బందికి తెలియజేసింది. పాఠశాలలో పని చేస్తున్న ఆయాతో కోతులగుట్ట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. సంధ్య వెంట పాఠశాల వార్డెన్‌గాని, టీచర్‌గాని వెళ్లలేదు. ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్న సంధ్య పాఠశాలకు తిరిగివచ్చి పాఠశాలలోని సిక్ రూమ్‌లో ఉంది. అదే సమయంలో ఎర్రబోరుకు చెందిన ఓ మహిళ అదే పాఠశాలలో చదువుతున్న తన కూతురిని చూడటానికి వచ్చింది. సిక్‌రూమ్‌లో ఉన్న సంధ్య ఆరోగ్య పరిస్థితి గమనించి ఇంటికివెళ్లి బాలికకు తల్లిదండ్రులు ఎవరు లేకపోవడంతో సంధ్య పెద్దమ్మకు ఆ మహిళ విషయం తెలియజేసింది. హుటాహుటిన పాఠశాలకు వచ్చిన ఆమె సంధ్యను తమ ఇంటికి తీసుకువెళతానని పాఠశాల హెచ్‌ఎంకి తెలిపింది. పాఠశాల సిబ్బంది తెలివిగా తీసుకువెళితే తమకు ఎటువంటి బాధ్యతలేదని లెటర్ రాయించుకుని సంధ్యను ఇంటికి పంపించారు. అయితే ఇంటికి వెళ్లాక 4వ తేదీన మళ్లీ సంధ్యకు తీవ్ర కడుపునొప్పి రావడంతో ఎర్రబోరునుంచి భద్రాచలం ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేశారు. మార్గమధ్యలోనే సంధ్య మరణించింది. పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యంతోనే సంధ్య చనిపోయిందంటూ ఆమె బంధువులు మృతదేహాన్ని తీసుకువచ్చి రాస్తారోకో నిర్వహించారు. సుమారు 4గంటలపాటు రాస్తారోకో నిర్వహించారు. విచారణ జరిపిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. శనివారం ట్రైబల్‌వెల్ఫేర్ డీడీని విచారణ నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య విచారణకు ఆదేశించారు.



బాలిక మృతదేహంతో రాస్తారోకో చేస్తున్న బంధువులు, టీడీపీ నాయకులు, ఇన్‌సెట్‌లో బాలిక సంధ్య

కాకినాడ

అరుణాచలం గిరి ప్రదక్షిణకు బస్సులు

కోటనందూరు, జనవరి 5: అరుణాచలం గిరి ప్రదక్షిణకు తుని ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్టు అధికారులు ప్రకటనలో తెలిపారు. ప్రతి నెల పౌర్ణమికి ముందురోజు సూపర్ లగ్జరీ తుని నుంచి బయలుదేరి విజయవాడ, శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం గిరి ప్రదక్షిణ, కంచి తది తర తీర్థయాత్రలు చూపించి తునికి వస్తుందన్నారు. టిక్కెట్లు కావాలసినవారు 7382913216, 7382913016లో సంప్రదించాలని వారు కోరారు.

దుర్మార్గుడి చేతిలో కాకినాడ : వనమాడి

కాకినాడ సిటీ, జనవరి 5: రాష్ట్రంలో అత్యంత అవినీతిపరుడు, దుర్మార్గుడి చేతిలో కాకినాడ నగరం ఉందని... ఎమ్మెల్యే ద్వారంపూడి చేస్తున్న అవినీతి, దౌర్జన్యం, దోపిడీలతో కాకినాడ అభివృద్ధి కుంటుపడిందని మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆరోపించారు. కాకినాడలో టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చేశాం కాబట్టి ప్రజల్లో ధైర్యంగా తిరుగుతున్నామని చెబుతున్న ద్వారంపూడి అభివృద్ధి చేసి ఉంటే బారికేడ్లు, పరదాల మధ్య జగన్‌రెడ్డి ఎందుకు తిరుగుతున్నాడో చెప్పాలన్నారు. టీడీఆర్ బాండ్ల పేరుతో రూ.219కోట్లు ద్వారంపూడి కొట్టేశాడని, దీని వల్ల సబ్ రిజిస్ట్రార్ సస్పెండ్ అయ్యారన్నారు. కాకినాడ నగరానికి బ్రాందీ షాపు, స్పా సెంటర్లు లాంటి రెండు పెద్ద ప్రాజెక్టులు తీసుకువచ్చి ప్రారంభించారన్నారు. తనపై పోటీకి భయపడుతున్న ద్వారంపూడికి పవన్‌కల్యాణ్ వరకు ఎందుకని కొండబాబు అన్నారు. సమావేశంలో టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, గదుల సాయిబాబు, పలివెల రవి, తుమ్మల రమేష్, కొల్లాబత్తుల అప్పారావు, వొమ్మి బాలాజీ, సీకోటి అప్పలకొండ, గుజ్జు లక్ష్మణరావు పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారంపై జనసేన ప్రత్యేక దృష్టి'

పిఠాపురం, జనవరి 5: పిఠాపురం నియోజకవర్గంలో దశబ్దాలుగా ఉన్న సమస్యల పరిష్కారం, పెండింగ్ ప్రాజెక్టుల సాధనపై జనసేన ప్రత్యేక దృష్టి పెడుతుందని ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ తెలిపారు. మంగళగిరిలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో పవన్‌ను పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ శుక్రవారం కలిసి నియోజకవర్గ పరిస్థితులను వివరించారు. సమస్యలపై నివేదిక అందజేశారు. ఏలేరు, సుద్దగడ్డ ఆధునీకరణకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తామని పవన్‌తెలిపారు. పిఠాపురంలో ఉప్పాడ రైల్వేగేటు వద్ద ఆర్వోబీ నిర్మాణం, పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలకు డంపింగ్‌యార్డుల ఏర్పాటు, తాగునీటి సమస్య, ప్రభుత్వాసుపత్రిలో సౌకర్యాల కల్పన, పీబీసీ కాలువల ఆధునీకరణ తదితర అంశాలును ఉదయశ్రీనివాస్ వివరించారు. వారాహియాత్ర సమయంలో నియోజకవర్గ సమస్యలు తన దృష్టికి వచ్చాయని, వాటిని ప్రణాళికబద్ధంగా పరిష్కరించే బాధ్యత జనసేన తీసుకుంటుందని పవన్ చెప్పారు.

తగ్గిన రోడ్డు ప్రమాదాలు : సీఐ

గండేపల్లి, జనవరి 5: గతంతో పోల్చుకుంటే 2023లో రోడ్డు ప్రమాదాలు తగ్గాయని సీఐ లక్ష్మణరావు తెలిపారు. శుక్రవారం మురారి నుంచి నీలాద్రిపేట వరకు ఉన్న ప్రమాద స్పాట్‌లను పరిశీలించి మాట్లాడుతూ 2021లో 53 రోడ్డు ప్రమాదాలు జరగ్గా 32 మంది మరణించగా 36 మందికి గాయాలయ్యాయి. 2022లో 38 మందికి రోడ్డు ప్రమాదాలు జరగ్గా 28 మంది మృతి చెందగా మరో 28 మందికి గాయాలయ్యాయన్నారు. 2023లో 34 రోడ్డు ప్రమాదాలు జరగ్గా 18 మంది మరణించగా 29 మంది గాయపడ్డారని తెలిపారు. ఈ మూడేళ్లతో పోల్చుకుంటే 2023లో గణనీయంగా రోడ్డు ప్రమాదాలు తగ్గాయన్నారు. ప్రమాదాలు తగ్గించేందుకు బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించి ట్రాఫిక్ సిగ్నల్ బోర్డులు, డ్రమ్ములు, కోన్‌లు ఏర్పాటు చేయడంతో పాటు ఎప్పటికప్పుడు హైవే మొబైల్‌లో పర్యవేక్షిస్తామన్నారు. ఎస్ఐ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

'పేదల పక్షాన గొంతు విప్పితే అక్రమ కేసులు'

గొల్లప్రోలు రూరల్, జనవరి 5: పేదల పక్షాన గొంతు విప్పినందుకు తనపై అక్రమంగా కేసులు బనాయించారని ఆంధ్రప్రదేశ్ పాఠశాలల పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పిల్లా చంద్రం తెలిపారు. గొల్లప్రోలు పోలీసులు శుక్రవారం ఫోన్ చేసి తనపై బైండోవర్ కేసు ఉందని, తహశీల్దార్ కార్యాలయానికి రావాలని చెప్పారన్నారు. తనకు కోడిపందేలు, పేకాట, మద్యం తదితర దురలవాట్లు లేవని.. 5 నెలల క్రితం కొడవలి గ్రామంలో మైనింగ్ వ్యతిరేకంగా ఉద్యమం నడిపినందుకే ఇప్పుడు కేసు పెట్టినట్లు అర్థమవుతుందని తెలిపారు. నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీ అంటూ వారి గొంతుకనే నొక్కేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని మండిపడ్డారు. నోరు విప్పితే అక్రమ కేసులు బనాయిస్తూ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తుందని, రాబోయే రోజుల్లో ప్రభుత్వానికి ఓటు ద్వారా బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

పలుచోట్ల పింఛన్ల పంపిణీ

గండేపల్లి, జనవరి 5: గండేపల్లి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఎంపీపీ చలగళ్ళ దొరబాబు ఆధ్వర్యంలో మాజీ మంత్రి తోట నరసింహం లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. తోట రాంజీ, రామకుర్తి మూర్తి, ఒబిన్ సత్యనారాయణ, కుంచే చినబాబు, పరిమి వెంకటేశ్వరరావు,ఎంపీడీవో వెంకట్రామన్ ఉన్నారు.

ప్రత్తిపాడు: ఏలేశ్వరంలో నగర పంచాయతీ కార్యాలయం వద్ద చైర్‌పర్సన్ అలమండ సత్యవతి చలమయ్య ఫించన్లను లబ్ధిదారులకు అందజేశారు. కౌన్సిలర్లు దోకిషోర్, సుంకర రాంబాబు, సామంతుల సూర్యకుమార్, డేగల వెంకటరమణ, కూరాడ ప్రసాద్, వాగు బలరాం, మున్సిపల్ కమిషనర్, చిడగం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో కొత్తగా మంజూరైన పింఛన్లను ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పెండెం దొరబాబు లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

కోటి మట్టి శివలింగాల తయారీ

జగ్గంపేట, జనవరి 5: ఇర్రిపాక ఏలేరు నది తీరాన వేంచేసి ఉన్న భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో కోటి మట్టి శివలింగాలతో మహా కుంభాభిషేకం జ్యోతుల నెహ్రూ కుటుంబం నిర్వహించ తలపెట్టిన విషయం విదితమే. తయారీకి జగ్గంపేట మార్వాడీ కుటుంబాలు విచ్చేసి నెహ్రూ మణి దంపతులను సత్కరించారు. టీడీపీ నేత ఎస్వీఎస్ అప్పలరాజు, గోకవరం సొసైటీ మాజీ చైర్మన్, సీనియర్ టీడీపీ నాయకులు దాసరి తమ్మన్నదొర, మనవడు దాసరి తరుణ్, తోట సునీత, అనీష్ నెహ్రూ, కొత్త కొండబాబు, వేములకొండ జోగారావు, అడబాల భాస్కరరావు, భరత్, మోతిలాల్, చున్నీలాల్, జీతారామ్, జింతేందర్, నాగం వెంకటపతి, యుదుదల అర్జునరావు, అడబాల సింగరయ్య చంపాలాల్, వమ్మి శ్రీనివాస్, బేరా రామ్ ఉన్నారు.

1700 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రత్తిపాడు, జనవరి 5: ప్రత్తిపాడు సెబ్ అధికారులు సర్కిల్ పరిధిలో శుక్రవారం దాడులు నిర్వహించి 1700 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. కృష్ణవరంలో 700 లీటర్లు, కత్తిపూడిలో 1000 లీటర్లు బెల్లపు ఊటను ధ్వంసం చేసి 40లీటర్ల సారా స్వాధీనం చేసుకుని అబ్బిరెడ్డిరాజు, కందిపల్లి అచ్చుతరామయ్యపై కేసులు నమోదు చేశారు. అనంతరం ప్రత్తిపాడు, కిర్లంపూడిలో పాత నేరస్తులు 15 మందిని బైండోవర్ కేసుల్లో అరెస్టు చేసి రెండు మండలాల తహశీల్దార్ల వద్ద హాజరుపరిచారు. దాడుల్లో సీఐ పి.అశోక్, పి.సునీల్‌కుమార్, జె.విజయ్‌కుమార్ ఎస్ఐ. బి.శ్రీనివాసరావు, సిబ్బంది వెంకన్నదొర, కృష్ణార్జున, దొరబాబు, రాంబాబు, వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు అరబిందో ఆర్థిక సాయం

తొండంగి, జనవరి 5: అరబిందో ఫార్మా ఫౌండేషన్ అనుబంధ లైఫియస్ ఫార్మా ఆధ్వర్యంలో పేద మత్స్యకారులు 29 మందికి 8 లక్షల ఆర్థిక సాయం అందించింది. శుక్రవారం పెరుమాళ్ళపురంలో సంస్థ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ వెంకట్రావు చెక్కులు అందించారు. మత్స్యకార నేత గంగిరి అడవియ్య మాట్లాడుతూ నిరుపేద మత్స్యకారులు వేటకు అవసరమైన పరికరాలు కొనుగోలు చేసుకుని జీవించేందుకు అరబిందో చేసిన సాయం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సంస్థ అధినేతలు శరత్‌చంద్రారెడ్డి, నిత్యానందరెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. సంస్థ ప్రతినిధి సుధాకర్ పాల్గొన్నారు.

పీఎంపీ అసోసియేషన్ కార్యదర్శి మృతి

పిఠాపురం రూరల్, జనవరి 5: పిఠాపురం మండలం చిత్రాడలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మరణించారు. పీఎంపీ డాక్టర్ అసోసియేషన్ కార్యదర్శిగా పనిచేస్తున్న కోన విజయకుమార్(52) పిఠాపురంలో కడుతున్న ఇంటి వద్దకు వచ్చి వాటరింగ్ అనంతరం మోటార్‌సైకిల్‌పై చిత్రాడ బయలుదేరారు. చిత్రాడ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ మరణించాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

కరకుదురులో వ్యక్తి ఆత్మహత్య

పెదపూడి, జనవరి 5: తనకు రావలసిన బాకీలు రాక, చేసిన అప్పులకు వడ్డీ పెరుగుచుండడంతో కలత చెంది కరకుదురులో వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెదపూడి ఎస్ఐ శోభన్ కుమార్ వివరాల ప్రకారం... కరకుదురుకి చెందిన తోటకూర చక్రరావు (46) ఫైనాన్స్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. అతడు ఇతరుల వద్ద చేసిన అప్పుకు వడ్డీలు పెరిగిపోతున్నాయి. తీవ్ర మనస్థాపానికి గురైన పెమ్మనబోయిన శ్రీరంగానికి చెందిన నర్సరీలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చక్రరావుకు రూ.32లక్షలు రావాలని రాసిన కాగితం మృతుడి జేబులో ఉన్నట్టు గుర్తించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్: సలార్, డెవిల్ బబుల్‌గమ్, యానిమల్, హాయ్ నాన్న

తిరుమల	:	డెవిల్
లక్ష్మి	:	డెవిల్
సీ అండ్‌సీ1	:	కపాలదీవి
సీ అండ్‌సీ2	:	సలార్
శ్రీప్రియ	:	పిండం
పద్మప్రియ	:	యానిమల్
సత్యగౌరి	:	పిండం
సూర్య 1	:	డెవిల్
సూర్య 2	:	సలార్

'రోడ్లపై చెత్త వేయవద్దు'

కార్పొరేషన్ (కాకినాడ), జనవరి 5: పారిశుధ్య కార్మికుల సమస్యను దృష్టిలో ఉంచుకుని చెత్తను రోడ్లు, డ్రైనేజీల్లో వేయకుండా ప్రజలు సహకరించాలని కమిషనర్ నాగనరసింహారావు కోరారు. శుక్రవారం ఆయన మెయిన్ రోడ్ పెదమార్కెట్, జ్యోతుల మార్కెట్, లక్ష్మీనారాయణ కంపెనీ ప్రాంతాల్లో హెల్త్‌ఆఫీసర్ డాక్టర్ డి.పృథ్వీచరణ్‌తో కలిసి పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. ఆయన వెంట శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వి.రాజేంద్రప్రసాద్ తదితరులున్నారు.

టీడీపీలో భారీగా చేరికలు



జగ్గంపేటలో టీడీపీలో చేరినవారితో నెహ్రూ



ప్రత్తిపాడు : టీడీపీలో చేరినవారితో సత్యప్రభ

జగ్గంపేట, జనవరి 5: జగ్గంపేటలో వైసీపీకి చెందిన సుమారు వందమంది రైతులు వానశెట్టి సూరిబాబు ఆధ్వర్యంలో కాకర నాగేశ్వరరావు, వానశెట్టి ఎరకయ్య, జీలంసింగరయ్య, వానశెట్టి గురయ్య, తదితర కౌలు రైతులు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ సమక్షంలో శుక్రవారం టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు వేసి స్వాగతం పలికారు. నెహ్రూ, జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కు రైతులు తమ సమస్యలను విన్నవించుకున్నారు. నెహ్రూ మాట్లాడుతూ ప్రజలను అన్ని రకాలుగా మోసం చేసిన ముఖ్యమంత్రి జగన్‌ని ఇంటికి పంపించి టీడీపీ, జనసేన సంకీర్ణ ప్రభుత్వాన్ని గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, కొత్త కొండబాబు, పాండ్రంగి రాంబాబు, వేములకొండ జోగారావు, జీను సత్తిబాబు, కురమళ్ళ నాగేశ్వరరావు, పీలా మహేష్, నండ్ల చిరంజీవి, బొండా రాజేష్, బద్ది సురేష్, నేదురి గణేష్, పలివెల యేసురాజు, రీసు రవణ, ఎస్వీ ప్రసాద్, పొట్టిశ్రీను, కొండబాబు యాదవ్ ఉన్నారు.

రమణయ్యపేటలో 120 మంది...

ప్రత్తిపాడు: రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో టీడీపీ,జనసేనదే విజయమని ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభరాజా చెప్పారు. ఏలేశ్వరం మండలం రమణయ్యపేటలో శుక్రవారం 50 కుటుంబాలకు చెందిన 120 మంది వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలోకి చేరారు. వారందరికీ సత్యప్రభ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో వేమగిరి ఏసుదానం, మిరియాల ఏసుబాబు,

వైసీపీ నుంచి టీడీపీలోకి కౌలు రైతులు

చిలుకోటి నాగేశ్వరరావు, ఎం.అన్నవరం, దొడ్డిపాటి శ్రీను, కె.రాజశేఖర్, మూలయ్య, చంద్రరావు ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు సూది బూరయ్య, మాజీ జడ్పీటీసీ జ్యోతుల పెదబాబు, బోరా సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ బాబురావు, కామరాజు, బొదిరెడ్డిగోపి, మూది నారాయణస్వామి, బస్వా ప్రసాద్, పలివెల వెంకటేశ్వరరావు, గంగిశెట్టి సత్యనారాయణ, జిగటాపు సూరిబాబు, కర్రి సుబ్బారావు, నూకతాటి ఈశ్వరుడు, జనసేన కార్యకర్తలు ఉన్నారు.

కోదాడలో దళితులు...

తొండంగి: తొండంగి మండలం కోదాడ గ్రామానికి చెందిన దళితులు భారీ సంఖ్యలో టీడీపీలో చేరారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి యనమల కృష్ణుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి యనమల దివ్య ఆధ్వర్యంలో బూర్తి కృష్ణ, తుని మార్కెట్ కమిటీ మెంబరు బూర్తి సత్యవతి ఆధ్వర్యంలో వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. వారికి కృష్ణుడు, దివ్య పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కృష్ణుడు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయం ఖాయమన్నారు. పులుగు రమణ, బంగారు బాబు, రాజీవ్‌గాంధీ, బూర్తి లోవరాజు, శ్రీనివాస్, దిమ్మిలి చంద్రరావు పార్టీలో చేరినవారిలో ఉన్నారు. టీటీపీ మండలాధ్యక్షుడు చొక్కా అప్పారావు, జనసేన మండలాధ్యక్షులు బెండపూడి నాయుడు, పేకేటి హరికృష్ణ, కోడ వెంకటరమణ, ఎన్.సత్యన్నారాయణ ఉన్నారు.

కొనసాగిన అంగన్‌వాడీల ఆందోళనలు



ప్రత్తిపాడు: ఏలేశ్వరంలో అంగన్‌వాడీల ధర్నా

పిఠాపురం, జనవరి 5: తమ డిమాండ్లు పరిష్కరించాలని, ఎన్నికల ముందు సీఎం జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ నిరవధిక సమ్మెలో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పిఠాపురంలోని తహశీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన కొనసాగించారు. సీఐటీయూ, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రతినిధులు ఉన్నారు.

శంఖవరం: శంఖవరంలో ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల నిరాహారదీక్షకు జనసేన పార్టీ మద్దతు తెలిపింది. ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల తమ్మయ్యబాబు దీక్షా శిబిరానికి చేరుకుని మద్దతు తెలిపారు. కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి నల్లల రామకృష్ణ, జిల్లా ప్రోగ్రామ్ సభ్యులు కర్ణం సుబ్రహ్మణ్యం, మండలాధ్యక్షులు గాబు సుభాష్, ఇందన సత్తివీర్రాజు, కిర్తీ శ్రీను, బాబి, కర్రి అశోక్, మేకల కృష్ణ తదితరులు ఉన్నారు.

సామర్లకోట: అంగన్‌వాడీ సిబ్బంది చేపట్టిన నిరవదిక సమ్మె శుక్రవారం 25వ రోజుకు చేరుకుంది. సామర్లకోట మండలం, పట్టణం

మద్దతు పలికిన పలువురు నాయకులు

పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది ప్రదర్శనగా సామర్లకోట నుంచి పెద్దాపురం వెళ్లారు.

జగ్గంపేట: జగ్గంపేటలో అంగన్‌వాడీ టీచర్లు వర్కర్లు ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. న్యాయమైన డిమాండ్లు నెరవేర్చేవరకు విరమించేది లేదని జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రావతి తెలిపారు.

ప్రత్తిపాడు: ఏలేశ్వరం, ప్రత్తిపాడు తహశీల్దార్ కార్యాలయాల వద్ద అంగన్‌వాడీలు ధర్నాలు చేశారు. ఏలేశ్వరంలో కాకరపల్లి సునీత, రాణి, గంగాభవాని, పార్వతి, కె.బంగారుపాప, ప్రత్తిపాడులో అల్లాడి లక్ష్మి, కె.హేమలత, కె.నాగ సత్యవతి, తులసి, పద్మ, జ్యోతి పాల్గొన్నారు.

తుని రూరల్: తునిలో అంగన్‌వాడీ శిబిరం వద్ద సోదె చెబుతూ అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. అంగన్‌వాడీలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎంఎం.పళ్లంరాజు, డాక్టర్ పాండురంగారావు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు శ్రీనివాస్, సీఐటీయూ కార్యదర్శి ధనలక్ష్మి, రమణమ్మ పాల్గొన్నారు.



శంఖవరం శిబిరంలో జనసేన నాయకులు

మద్యం దుకాణం ఏర్పాటు విరమించుకోవాలి

సర్పవరం జంక్షన్, జనవరి 5: జనావాసాల మధ్య మద్యం దుకాణాలు, అనధికారిక బెల్ట్‌షాప్‌లతో మందుబాబుల ఆగడాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, కొత్తగా మరొక మద్యం దుకాణం ఏర్పాటు చేయడాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని స్థానిక మహిళలు రమణమ్మ, లక్ష్మి, పద్మ, జానికమ్మ తెలిపారు. శుక్రవారం ఛత్రపతి శివాజీ మహరాజ్ యువసేన వ్యవస్థాపకుడు పాలిక వీరవెంకట రామకృష్ణ ఆధ్వర్యంలో వలసపాకల మెయిన్‌రోడ్డులో లిక్కర్ వాక్ ఇన్ స్టోర్ పేరిట ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వ మద్యం షాప్ వద్ద ఆందోళన చేపట్టారు. మహిళలు మాట్లాడుతూ సుమారు 9 వేలు జనాభా ఉన్న గ్రామంలో ఇప్పటికే 4 ప్రభుత్వ మద్యం దుకాణాలు దీంతో పాటు అనధికారికంగా బెల్ట్‌షాప్‌లు ఉన్నాయన్నారు. మద్యం దుకాణాలు అధికంగా ఉండడంతో భర్తలు సరిగా పనుల్లోకి వెళ్లకుండా, సంపాదించిన డబ్బంతా మందుకే ఖర్చుచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అల్లరిమూకలు మద్యం తాగి చోరీలు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారన్నారు. ఇప్పుడు కొత్తగా మరొక మద్యం దుకాణం ఏర్పాటుతో మరిన్ని నిరుపేదల జీవితాలు ఇబ్బందుల పాలు అవుతారన్నారు. పక్కనే ఉన్న వాకలపూడిలో సుమారు 30 వేలు జనాభా ఉండగా అక్కడ ఒక మద్యం దుకాణమే ఉందని, చిన్న గ్రామంలో అధికంగా మద్యం షాప్‌లు ఉన్నాయన్నారు. మద్యం దుకాణానికి వ్యతిరేకంగా నవంబరు, డిసెంబర్‌లో కలెక్టరేట్ స్పందనలో ఫిర్యాదు చేసినా అధికారులు ఏ చర్యలు తీసుకోలేదన్నారు.



సర్పవరం జంక్షన్ : మద్యం దుకాణానికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న మహిళలు

మద్యపాన నిషేధం అమలు చేయాలి

ప్రత్తిపాడు, జనవరి 5: ప్రత్తిపాడులో సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పెద్దఎత్తున మహిళలు ర్యాలీ నిర్వహించారు. మద్యపాన నిషేధంపై సీఎంజగన్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ఆందోళన చేశారు. మద్యపాన వ్యతిరేక పోరాట కమిటీ జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎన్‌సూర్యనారాయణ, నాయకులు వేమగిరి తలుపులయ్య, చంటి, మిరియాల సత్యనారాయణ, మోర్త కుశలమ్మ, కాటేటి అమ్మాజీ, నురుకుర్తి లోవ, మిరియాల కృపారాణి, లోవ, ఎన్. పెంటమ్మ తదితరులు ఉన్నారు.



గొల్లప్రోలులో పొర్లు దండాలు పెడుతున్న దృశ్యం

పారిశుధ్య కార్మికుల నిరసన

గొల్లప్రోలు, జనవరి 5: డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మె చేస్తున్నా పట్టించుకోకపోవడంతో ప్రభుత్వం మా గోడు వినాలంటూ అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు పొర్లుదండాలు పెడుతూ నిరసన తెలిపారు. సీఐటీయూ అనుబంధ ఏపీ మున్సిపల్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె చేస్తున్న కార్మికులు గొల్లప్రోలు నగరపంచాయతీ కార్యాలయం వద్ద శిబిరంలో తమ నిరసన కొనసాగించారు. సీఐటీయూ నేతలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన

తుని రూరల్, జనవరి 5: సీఎం జగన్ తమకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులు చేపడుతున్న సమ్మె తునిలో కొనసాగుతుంది. శిబిరంలో ప్రజా సంఘాల నాయకులు మద్దతుగా నిలిచారు.

సామర్లకోట: సామర్లకోట మున్సిపల్ రెగ్యులర్, ఔట్ సోర్సింగ్ వర్కర్ల సమ్మెలో యూనియన్ అధ్యక్షులు బొచ్చా శ్రీను, మల్లిపూడి లక్ష్మి, కె.కిషోర్, చెన్నా వెంకటేశ్వర్లు, చిడతా వరలక్ష్మి, సింగంపల్లి అప్పారావు, బంగారు వెంకన్న పాల్గొన్నారు. పలువురు నేతలు సంఘీభావం ప్రకటించారు.

జనసేన సంఘీభావం

కార్పొరేషన్ (కాకినాడ): కాకినాడ నగరపాలక సంస్థ మున్సిపల్ వర్కర్ల సమ్మెకు జనసేన పార్టీ సిటీ ఇన్‌చార్జి ముత్తా శశిధర్ శుక్రవారం సంఘీభావం ప్రకటించారు. సీఎం జగన్, ఎమ్మెల్యే ద్వారంపూడి ప్రెస్‌మీట్‌లు పెట్టి గొప్పలు చెప్పుకోవడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదన్నారు.

పీడీ కార్యాలయం ముట్టడించిన యానిమేటర్లు

కాకినాడ సిటీ, జనవరి 5: రాజకీయ కారణాలతో అక్రమంగా తొలగించిన వీవోఏ (యానిమేటర్ల)ను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాకినాడ డీఆర్డీవో పీడీ కార్యాలయాన్ని సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం వీవోఏలు ముట్టడించారు. ఈ సందర్భంగా ఏపీ వెలుగు వీవోఏ ఉద్యోగుల సంఘం నాయకురాలు కె.గంగాభవాని, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జి మాట్లాడారు. గత నాలుగేళ్లలో అనేకసార్లు పీడీ కార్యాలయంలో వీవోఏల సమస్యలపై వినతిపత్రాలు ఇచ్చినా ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదన్నారు. సమస్యలను పట్టించుకోకపోతే ఇదే పీడీ కార్యాలయం వద్ద ఈనెల 6వ నుంచి రిలే నిరాహార దీక్షలకు దిగుతామని హెచ్చరించారు. తొలుత త్రీటౌన్ సీఐ చర్చల మేరకు వెలుగు అధికారులను కార్యాలయం లోపలికి అనుమతించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు మేరీ, సీఐటీయూ జిల్లా నాయకులు మేడిశెట్టి వెంకటరమణ, దుమ్ముల మేరీ, సాధనాల పద్మ, కె.ఈశ్వరి భాయ్, ఎం.రామలక్ష్మి, కె.సత్యవేణి, ఎస్.దేవి నాయకత్వం వహించారు.

టీడీపీ పాలనలోనే అభివృద్ధి

ఎమ్మెల్యే చినరాజప్ప



సామర్లకోటలో ప్రచారం నిర్వహిస్తున్న చినరాజప్ప

సామర్లకోట, జనవరి 5: తెలుగుదేశం పార్టీ పాలనలోనే రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం అమలు అయ్యాయని పొలిట్‌బ్యూరో సభ్యుడు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప చెప్పారు. సామర్లకోట 4వ వార్డుకు చెందిన బ్రౌన్‌పేట, కుమ్మరివీధి, అంబేడ్కర్ పార్క్ వీధి తదితర ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ పేరిట ప్రచార కార్యక్రమం రాజప్ప ఇంటింటా నిర్వహించారు. టీడీపీ అధినేత చంద్రబాబు మేనిఫెస్టోలో పొందుపరిచిన సూపర్‌సిక్స్ పథకాలతో అన్ని వర్గాలకు మేలు చేకూరనుందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీల కూటమిని గెలిపించాల్సిన అవసరం ప్రజలందరిపైనా ఉందని చెప్పారు. పార్టీ కరపత్రాలను పంపిణీ చేశారు. పట్టణ టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

సాగునీరందించలేని ప్రభుత్వం

మాజీ ఎమ్మెల్యే వర్మ



గొల్లప్రోలులో పంటపొలాలను పరిశీలిస్తున్న వర్మ

గొల్లప్రోలు, జనవరి 5: దాళ్వాకు సాగునీరందించలేని దుస్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ విమర్శించారు. గొల్లప్రోలు పట్టణ శివారులో సాగునీరందకఎండిపోతున్న వరి నారుమడులను, నాట్లు లేక బీడుభూములుగా మారిన పంటపొలాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. గొల్లప్రోలులోని ఊబంద కాలువ కింద 1500 ఎకరాలు, కొత్తకాలువ కింద 400 ఎకరాలతో పాటు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో వందలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని వర్మ తెలిపారు. గొల్లప్రోలు, బి.ప్రత్తిపాడు, బోగాపురం, సీతానగరం తదితర గ్రామాల్లో రైతులు రోడ్డున పడ్డారని, పంటపొలాలు బీడులుగా ఉన్నాయని తెలిపారు. రైతులకు సాగునీరందించకుంటే ఎకరానికి రూ.30వేలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు దాళ్వాకు సాగునీరు ఎందుకు అందించలేకపోతున్నారో ఎంపీ, ఎమ్మెల్యేలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మొత్తం ఆయకట్టు అంతటికి సాగునీరు ఇవ్వాలన్నారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు, శీరం మాణిక్యం, కదారి బాబ్జి పాల్గొన్నారు.

న్యాయవాదులకు సంఘీభావం

పిఠాపురం, జనవరి 5: ఏపీ న్యూ ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ న్యాయవాదులు చేస్తున్న ఆందోళనకు పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ సంఘీభావం తెలిపారు. ఆందోళనలో పిఠాపురం బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన

కాకినాడ సిటీ, జనవరి 5: విజయవాడలోని సమగ్ర శిక్షా రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ కేంద్ర కార్యాలయం వద్ద తలపెట్టిన ధర్నాకు బయలుదేరిన సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను అరెస్టులు చేయడాన్ని ఖండిస్తూ కాకినాడలోని ధర్నాచౌక్ వద్ద శుక్రవారం సమ్మె శిబిరంలో ఒంటి కాలిపై నిల్చొని నిరసన తెలిపారు. శాంతియుతంగా తలపెట్టిన ధర్నాకు బయలుదేరిన ఉద్యోగులను అరెస్టులు చేయడం తగదని సీఐటీయూ కాకినాడ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దువ్వా శేషబాబ్జి, చెక్కల రాజ్‌కుమార్ ధ్వజమెత్తారు. ఉద్యోగుల న్యాయ, చట్టబద్ధమైన డిమాండ్లు పరిష్కరించి 17రోజులుగా జరుగుతున్న సమ్మెను విరమింపజేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ అనుబంధ సంఘాలన్నీ ఉద్యోగులకు మద్దతుగా పోరాటంలోకి దిగుతాయని వారు హెచ్చరించారు.

'జగనన్న మెగా కాలనీ ఏర్పాటు'

కరప, జనవరి 5: మండలంలో గురజనాపల్లి సమీపంలో సాల్ట్‌భూముల 180ఎకరాల్లో జగనన్న మెగా కాలనీ ఏర్పాటు చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. పెనుగుదురు, గురజనాపల్లి గ్రామాలకు చెందిన సాల్ట్ భూములను శుక్రవారం ఆయన నాయకులు, అధికారులతో పరిశీలించి మాట్లాడారు. ఈ భూముల్లో కాకినాడ రూరల్, అర్బన్, కరప మండలలకు చెందిన 8వేల మందికి ఇళ్లపట్టాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. 2వారాల్లో పట్టాలిచ్చేందుకు జగనన్న మెగా కాలనీని రూపొందిస్తున్నామన్నారు. కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిధిలో దాదాపు 32వేల మందికి ఇళ్ల పట్టాలిచ్చామన్నారు. కాకినాడ ఆర్డీవో కిశోర్, హౌసింగ్ పీడీ కె.శ్రీనివాస్, డ్వామా ఏపీడీ మాధవి, తహశీల్దార్ పి.శ్రీనివాసరావు, ఎంపీడీవో అప్పారావు, జడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, వైసీపీ మండలాధ్యక్షులు చింతా ఈశ్వరరావు, పచ్చిపీడి పాపారావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, సర్పంచ్ దేగల లలిత కుమారి ఉన్నారు.

తునిలో కాంగ్రెస్ సమావేశం

తుని రూరల్, జనవరి 5: జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ చిలుకూరి పాండురంగారావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశం తుని పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. సీడబ్ల్యూసీ సభ్యుడిగా ఎంపికైన తొలి సారి జిల్లాకు వచ్చిన డాక్టర్ ఎంఎం.పళ్లంరాజుకు ఘన స్వాగతం పలికారు. పార్టీ కార్యకర్తలు సన్మానించారు. అనంతరం జిల్లా కమిటీ ప్రమాణస్వీకారం నిర్వహించి పార్టీ బలోపేతానికి సంబంధించి పలు నిర్ణయాలపై సుదీర్ఘంగా చర్చించారు.

వనదుర్గ ఆలయంలో చండీహోమం

అన్నవరం, జనవరి 5: రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ,సప్త సతిపారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. 11 గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

అయోధ్య రాముని అక్షింతల పంపిణీ

ప్రత్తిపాడు, జనవరి 5: ఏలేశ్వరంలో శుక్రవారం అయోధ్య రామయ్య అక్షింతలు పంపిణీ చేశారు. రూపులమ్మ ఆలయం వద్ద వీహెచ్‌పీ సభ్యులు సత్సంగం ఏర్పాటు చేసి అక్షింతలు పంపిణీపై కార్యాచరణ నిర్వహించారు. పట్టణంలో అన్ని దేవాలయాలకు అక్షింతలు పంపిణీ చేయడానికి నిర్ణయించారు. కే.ప్రసాద్, కె.కిరీటి, గుర్రయ్య, పి.దేవి, కామాక్షి గిరిజా కుమారి, ఉమారమ, సూర్యకుమారి,అనంతలక్ష్మి పాల్గొన్నారు.

ఆసుపత్రిలో యంత్రం ప్రారంభం

తుని రూరల్, జనవరి 5: తుని ఏరియా ఆసుపత్రిలో లాప్రోస్కోపిక్ యంత్రాన్ని, రోగులు వేచి ఉంటే హాలును మంత్రి దాడిశెట్టి రాజా ప్రారంభించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ స్వప్న, అభివృద్ధి కమిటీ చైర్మన్ పోతల లక్ష్మణ్, మార్కెట్ కమిటీ చైర్మన్ అత్తిరెడ్డిబాబు పాల్గొన్నారు.

కోటనందూరు: మండల పరిషత్ కార్యాలయంలో పెరిగిన పింఛన్లను మంత్రి దాడిశెట్టి రాజా పంపిణీ చేశారు. ఎంపీపీ లగుడు శ్రీనివాస్, లంక ప్రసాద్, గొర్లె రామచంద్రరావు, గొర్లి అచ్చియ్యనాయుడు, లాలం బాబ్జీ పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

కొత్తపల్లి, జనవరి 4: మండలంలోని ఎండపల్లిలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న సిమ్మెంట్ రోడ్డు నిర్మాణ పనులకు కాకినాడ ఎంపీ వంగా గీత, పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు శంకుస్థాపన చేశారు. సీఎస్ఆర్‌లో భాగంగా పిఠాపురం నియోజకవర్గంలో పలు గ్రామీణ ప్రాంతాల్లో సిమ్మెంట్ రోడ్లు, సామాజిక భవన నిర్మాణ పనులకు రూ.2 కోట్లు మంజూరు చేసిన ఫౌండేషన్ డైరెక్టర్లు నిత్యానందరెడ్డి, శరత్‌చంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ శీలం పెద్ద అప్పారావు. ఎంపీపీ కారె సుధాశ్రీనివాసరావు, జడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్ పాల్గొన్నారు.

ప్రాకార మండపానికి శంకుస్థాపన

గొల్లప్రోలు, జనవరి 5: గొల్లప్రోలులోని సీతారామస్వామి దేవస్థానంలో రూ.1.32కోట్లు వ్యయంతో ప్రాకార మండప నిర్మాణానికి కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్, పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు

తుని రూరల్, జనవరి 5: ధనుర్మాస ఉత్సవాలు పురస్కరించుకుని ఎస్.అన్నవరంలో శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. గోదాదేవి మహోత్సవాన్ని చేపట్టి స్వామివారికి నివేదించిన అన్నప్రసాదాన్ని భక్తులకు వితరణ చేశారు. తుని పాత బజారు వీధిలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో భారీ అన్నదానం నిర్వహించారు.

ఎంపీడీవో పర్యటన

ప్రత్తిపాడు, జనవరి 5: ఏలేశ్వరం మండలంలోని ఏలూరు, టి.రాయవరం గ్రామాల్లో శుక్రవారం ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు పర్యటించి వికసిత్ భారత్ సంకల్పయాత్రపై అవగాహన సమావేశం నిర్వహించారు. కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమపథకాలపై వివరించారు.

వృద్ధులకు దుప్పట్ల అందజేత

తుని రూరల్, జనవరి 5: తుని అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీ సాయిసేవా వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు, నిత్యావసర సరుకులు క్లబ్ సభ్యులు అందజేశారు. డి.సత్యనారాయణ, కొచ్చెర్లపాటి భీమరాజు, నామన రవి, కుక్కడపు నాగరాజు, కీర్తి నాగేశ్వరరావు, కంకిపాటి రాము పాల్గొన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ కార్యవర్గం ఎంపిక

కార్పొరేషన్ (కాకినాడ), జనవరి 5: కాకినాడ సిటీ పాస్టర్స్ ఫెలోషిప్ పదవీ కాలం ముగియడంతో కార్యవర్గ ఎంపిక ఏకగ్రీవంగా జరిగింది. ప్రెసిడెంట్‌గా శీరం హైజాక్, వైస్ ప్రెసిడెంట్‌గా మోజెస్‌బెన్‌హం, సెక్రటరీగా శామ్యూల్ విక్టర్, జాయింట్ సెక్రటరీగా విల్సన్, ట్రెజరర్‌గా కె.ప్రకాష్, జాయింట్ ట్రెజరర్‌గా బలగం శ్యామ్‌కుమార్, ఇతర ఎగ్జిక్యూటివ్ మెంబర్లతో సహా అందరినీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గోతిలో ఇరుక్కున్న స్కూల్ బస్సు



సామర్లకోట, జనవరి 5: పట్టణంలోని కోలావారివీధిలో శిథిల కల్వర్టు మీదుగా విద్యార్థులతో వెళ్తున్న ఒక ప్రైవేట్ స్కూల్ బస్సు స్లాబ్‌రాయి పగలిపోవడంతో కల్వర్టు గోతిలో ఇరుక్కుంది. దీంతో బస్సులో ఉన్న విద్యార్థులను దింపి మరొక వాహనంలో స్కూల్‌కు పంపారు. ప్రమాదం తప్పడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. దీంతో ఆ రోడ్డులో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.